క్లుప్తంగా

వేతనాలు ఇవ్వాలని వినతి

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో కేజీబీవీల్లో, సమగ్ర శిక్షలో విధులు నిర్వర్తిస్తున్న బోధన, బోధనేతర సిబ్బంది వేతనాలు ఇవ్వాలని విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ వెంకటనర్సమ్మకు పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కట్టా శేఖర్‌రావు విన్నవించారు. గురువారం హైదరాబాద్‌లో ఆమెను కలిసి విన్నవించగా.. సమస్యను రెండు రోజుల్లో పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రంగారావు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలు మృతి


ఫాతిమాబి(ఫైల్)

ఖమ్మంఅర్బన్: నగరంలోని 14వ డివిజన్ గొల్లగూడెం చెందిన శతాధిక వృద్ధురాలు ఎస్‌కె.ఫాతిమాబి(100) అనారోగ్యంతో బుధవారం రాత్రి మృతి చెందారు. మృతురాలికి ఐదు కుమారులు, ఇద్దరు కుమార్తెలు కాగా వారిలో ఇద్దరు కుమారులు మృతి చెందారు. ఈమేరకు పలువురు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

అక్రమ మట్టి తోలకాలపై ఫిర్యాదు

ఖమ్మంరూరల్: మండలంలోని కాచిరాజుగూడెం పరిధి రేగులతండాలో ఎలాంటి అనుమతులు లేకుండా జరుపుతున్న అక్రమ మట్టి తోలకాలపై గ్రామానికి చెందిన కొందరు గురువారం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిత్యం రాత్రి పగలు తేడా లేకుండా తోలకాలు నిర్వహిస్తున్నారని, రెవెన్యూ, మైనింగ్, పోలీస్ అధికారులకు సమాచారం ఇచ్చినా ఎవరూ పట్టించుకోవడంలేదని తెలిపారు. గ్రామంలో మితిమీరిన వేగంతో లారీలను నడుతుండడంతో కొందరు యువకులు 100కు డయల్ చేయగా.. పోలీసులు గ్రామానికి చేరుకుని లారీల డ్రైవర్లను మందలించారు. ఉపేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మట్టి వ్యాపారులపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోస్టర్లు ఆవిష్కరణ

ఖమ్మం మామిళ్లగూడెం: విద్యారంగ సమస్యల పరిష్కారం, పెండింగ్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ జార్జిరెడ్డి పీడీఎస్‌యూ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యాన ఈనెల 15న ఉస్మానియా యూనివర్సిటీలో జరిగే డిబేట్‌ను జయప్రదం చేయాలని కోరుతూ గురువారం ఖమ్మం మహిళా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా గర్ల్స్ కన్వీనర్ పైండ్ల శ్యామల, మహంకాళి రాణి, జిల్లా నాయకులు బొడ్డు రాము మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకురాలు మన్విత, కృష్ణవేణి, శ్రీ హర్షిత, ఎలీషా, హెచ్చిత, సాయి, రోహిత్, జంపన్న, సాయి, రోహిత్, సంతోష్, చరణ్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

15న తహసీల్ ముట్టడి

నేలకొండపల్లి: పెన్షన్ల పెంపు సాధన కోసం ఈనెల 15న తహసీల్దార్ కార్యాలయ ముట్టడి చేయనున్నట్లు ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జ్ తోళ్ల సురేష్ తెలిపారు. గురువారం తహసీల్ ముట్టడిని విజయంతం చేయాలని కోరుతూ మండల కేంద్రంలో ప్రచారం నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆరు గ్యారంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పొట్టపింజర బాలస్వామి, తోళ్ల వెంకన్న, రాయబారపు గురవయ్య, శ్రీను, రామదాసు, గుండెపొంగు శ్రీకాంత్, కుక్కల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	కిష్కిందాపురి
వినోద	కొత్త లోక, డెమాన్‌స్లాయర్
సాయిరాం	డెమాన్‌స్లాయర్, కొత్తలోక
ఆదిత్య	మిరాయ్
శ్రీనివాస	లిటిల్ హార్ట్స్

- ఖమ్మంగాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	32	బచ్చలికూర	4
వంకాయ	26		20
బెండకాయ	16	పాలకూర	3
పచ్చిమిర్చి	56		20
కాకర	50	చుక్కకూర	3
బోడ కాకర	100		20
బీర	56	తోటకూర	4
దొండ	46		20
పొట్లకాయ	40	గోంగూర	4
చిక్కుడు	46		20
గోరుచిక్కుడు	46	మెంతికూర	3
క్యాబేజీ	24		20
క్యాలీఫ్లవర్	40	కొత్తిమీర	1
ఆలుగడ్డ	20		40
చామగడ్డ	30	పుదీన	1
క్యారెట్	46		20
బీట్‌రూట్	38		

-ఖమ్మం వ్యవసాయం

ఇక ప్రయాణం సాఫీగా..

పొన్నేకల్ బీటీ రోడ్డుకు మోక్షం
- రూ.35 కోట్లతో రహదారి నిర్మాణం
- పదేళ్లుగా రాకపోకలకు నరకయాతన
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు


పొన్నేకల్-పుల్లూరు మధ్య పూర్తయిన బీటీ రోడ్డు

కామేపల్లి: మండలంలోని పొన్నేకల్-పుల్లూరు మధ్య గ్రామాల ప్రజల దశాబ్దాల కల నెరవేరింది. ఇన్నాళ్లు సరైన రోడ్డు మార్గం లేక ఇబ్బందులు పడిన ప్రజలకు బీటీ రోడ్డు నిర్మాణంతో మోక్షం కల్గింది. పొన్నేకల్ మీదుగా కారేపల్లి మండలం పుల్లూరు, కమలాపురం, గుబ్బతండా, మేకలతండా, గేటు కారేపల్లి, ఇల్లెందులను కలుపుతూ సుమారు 24 కిలోమీటర్ల సింగిల్ రోడ్డును డబుల్ రోడ్డుగా మార్చేందుకు ప్రభుత్వాలకు దశాబ్దాల కాలం పట్టింది. 2016లో బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రోడ్డు మంజూరైనప్పటికీ నిర్మాణం చేపట్టలేదు. ఈక్రమంలో ఎట్టకేలకు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో బీటీ రోడ్డు పనులు పూర్తయ్యాయి. దీంతో స్థానిక ఎమ్మెల్యేకు, ప్రభుత్వానికి పలువురు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

రూ.35 కోట్లతో నిర్మాణం..

పొన్నేకల్ నుంచి పుల్లూరు మీదుగా ఇల్లెందు వరకు సుమారుగా 24 కిలోమీటర్ల డబుల్ రోడ్డు నిర్మాణానికి గత ప్రభుత్వం రోడ్డుకు రూ.35 కోట్లు మంజూరు చేసింది. దీంతో రోడ్డు నిర్మాణ పనులకు ప్రజాప్రతినిధులు శంకుస్థాపన చేయగా.. కాంట్రాక్టర్ సింగిల్ బీటీ రోడ్డును తొలగించి డబుల్ రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా కంకరపోసి చదును చేశాడు. అప్పటి నుంచి అనగా గత పదేళ్లుగా ఆ పనులు అలాగే నిలిచిపోయాయి. అప్పటి నుంచి రాకపోకలు సాగించిన పలువురు రోడ్డు ప్రమాదాలకు గురవుతుండగా.. ఆ రోడ్డున ప్రయాణమంటేనే ప్రయాణికులు జంకాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో సమస్యను ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన ప్రత్యేక చొరవ తీసుకోవడంతో నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఇప్పటికే బీటీ రోడ్డు నిర్మాణం పూర్తి కాగా.. సీసీ రోడ్డు నిర్మాణం మాత్రమే మిగిలింది. త్వరలోనే సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు అధికారులు చెబుతున్నారు..


బీటీ రోడ్డు నిర్మాణం చేపడుతున్న దృశ్యం

ఎమ్మెల్యే కృషితోనే..



ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ప్రత్యేక కృషితోనే పొన్నేకల్-పుల్లూరు మధ్య గత పదేళ్లుగా నిలిచిపోయిన బీటీ రోడ్డు పనులు శరవేగంగా పూర్తయ్యాయి. దీంతో రాకపోకలు సాఫీగా సాగుతున్నాయి. ఎమ్మెల్యేకు మా ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నాం.
– గింజల నర్సింహారెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు

పదేళ్లుగా ఇబ్బంది పడ్డాం..



డబుల్ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించి మధ్యలో ఆపడంతో గత పదేళ్లుగా నరకయాతన పడ్డాం. దీంతో అనేక ప్రమాదాలతో పాటు అనారోగ్యాల బారిన పడ్డాం. బీటీ రోడ్డు సమస్యను ఎమ్మెల్యే కనకయ్య దృష్టికి తీసుకెళ్లగా..ఆయన మా సమస్య తీర్చారు.
– వల్లభనేని అశోక్, పొన్నేకల్

రూ.35 కోట్ల నిర్మాణం చేపట్టాం..



పొన్నేకల్-పుల్లూరు మధ్య నిలిచిపోయిన 24 కిలోమీటర్ల బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.35 కోట్లు మంజూరు చేశారు. ఇప్పటికే బీటీ రోడ్డు నిర్మాణం పూర్తి కావడంతో పాటు త్వరలోనే మిగతా సీసీ రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తాం.
– గాదె ప్రవీణ్, ఆర్అండ్‌బీ ఏఈఈ

వన మహోత్సవాన్ని విజయవంతం చేయండి


బుద్ధారంలో మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

నేలకొండపల్లి: వన మహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ ఎం.యర్రయ్య సూచించారు. మండలంలోని బుద్ధారం-రాయగూడెం రహదారి వెంట వన మహోత్సవంలో భాగంగా నాటుతున్న మొక్కలను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం కొంగర, కట్టుకాచారం గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించి త్వరగా పూర్తి చేసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులు రాకుండా పారిశుద్ధ్యం పనులు యుద్ధప్రాతిపదికను చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆయా పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ టీఏ గోపి, క్షేత్ర సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులపై ఆరా

ఖమ్మంమయూరిసెంటర్: శానిటేషన్ విజిట్‌లో భాగంగా గురువారం కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య 46, 54, 55వ డివిజన్లలో పర్యటించి పారిశుద్ధ్య పనులపై ఆరా తీశారు. మెయిన్ రోడ్లు, డ్రెయిన్లు శుభ్రపరిచే పనులను పరిశీలించి స్థానికులతో మాట్లాడారు. నిత్యం ఇంటింటి చెత్త సేకరణ జరుగుతుందా లేదా, చెత్త సేకరణ ఆటో లేదా ట్రాక్టర్ ఎక్కడెక్కడ పనిచేస్తున్నాయి, వర్కర్ల పనితీరు ఎలా ఉందనే వివరాలు అడిగి తెలుసుకుని అటెండెన్స్ రిజిస్టర్లను పరిశీలించారు. ప్రతి రోజు ఉదయం 5:30 గంటలకు వాహనాలు ప్రారంభించేలా చర్యలు తీసుకుని పర్యవేక్షించాలని శానిటరీ సూపర్‌వైజర్‌ను, డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్‌లు రోజూ 15 డివిజన్లలో పర్యటించి సంబంధిత రిపోర్ట్‌ను తయారు చేసి కచ్చితంగా అందించాలి ఆదేశించారు. ఎక్కడైనా లోపాలు కనిపిస్తే కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు.

సీపీ గెట్ ర్యాంకర్లకు అభినందనలు


ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో ప్రిన్సిపాల్, తదితరులు


అనూష


అనురాధ

ఖమ్మం సహకారనగర్/రఘునాథపాలెం: రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీల్లో పీజీ ప్రవేశాల కోసం నిర్వహించే సీపీ గెట్ ప్రవేశ పరీక్షలో విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారు. ఈనేపథ్యాన నగరంలోని ఎస్ఆర్‌అండ్‌బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు కె.నరేష్ రాష్ట్రస్థాయిలో 3వ ర్యాంకు(ప్రభుత్వ పాలన శాస్త్రం విభాగంలో), ఐ.రాజేష్ 41వ ర్యాంకు(చరిత్ర విభాగంలో) సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్ జాకిరుల్లా తెలిపారు. అలాగే రాచమల్లు అనురాధ రాష్ట్రవ్యాప్తంగా 20వ ర్యాంకు(గణితశాస్త్రంలో), ఎం.అనూష 26వ ర్యాంకు(తెలుగు విభాగంలో) సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కంసాని వెంకటేశ్వరరావు తెలిపారు. విద్యార్థులను అభినందించారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

ఖమ్మం మామిళ్లగూడెం: నగరంలోని 46వ డివిజన్ పరిధి జూబ్లీపుర, సారధినగర్‌లలో మంత్రి తుమ్మల ఆదేశానుసారం లబ్ధిదారులకు కార్పొరేటర్ కన్నం వైష్ణవి ప్రసన్నకృష్ణ ఆధ్వర్యాన గురువారం కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు.. లబ్ధిదారులైన రామగిరి కృష్ణవేణి, తుల్మా రమాదేవి, వెలిశాల స్నేహలత, మోటే అనిత, అద్దంకి మమత, శ్రీలక్ష్మి, తాడూరి లక్ష్మీకళలకు వారి నివాసాలకు వెళ్లి అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సింగం అంజయ్య, డివిజన్ అధ్యక్షుడు షేక్ రజ్జి, బాణాల లక్ష్మణ్, జెట్ట కృష్ణయ్య, కాటం యాదయ్య, బాల్దే నాగేశ్వరరావు, రామకృష్ణ, మరాఠి బీరేష్, సెల్వం జ్ఞానేశ్వర్, తహసీల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆలయ హుండీ లెక్కింపు


నగదు లెక్కిస్తున్న సిబ్బంది

కామేపల్లి: మండలంలోని కొత్తలింగాల శ్రీ కోటమైసమ్మతల్లి దేవాలయ హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కింపు చేపట్టగా.. రూ.19,159 వచ్చినట్లు ఆలయ నిర్వాహణాధికారి నల్లమోతు శేషయ్య తెలిపారు. అనంతరం పాపకొల్లు గ్రామ సోమలింగేశ్వరస్వామి దేవాలయ కార్య నిర్వహణాధికారి ఉమ సమక్షంలో దేవాలయ దుకాణాలకు బహిరంగ వేలం నిర్వహించారు. కొబ్బరి కాయలు, పూజా సామగ్రి దుకాణాన్ని కొత్తగట్టు ఉమ రూ.1.40 లక్షలకు, కొబ్బరి చిప్పలుపోగు చేసుకునేందుకు బండారి రమేష్ రూ.21 వేలు, లడ్డు, పులిహోరా అమ్ముకునేందుకు రూ.12 వేలు, పోగు చేసిన తలనీలాలకు రూ.4500లకు పాటదారులు దక్కించుకున్నారు. గతేడాది కంటే అధనంగా రూ.70 వేలు ఆదాయం వచ్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పూజారి పుల్లయ్యశర్మ, జూనియర్ అసిస్టెంట్ వరప్రసాద్, తోటకూరి శ్రీనివాసరావు, సత్యమయ్య, మల్లెంపాటి శ్రీనివాసరావు, నాగేశ్వరి, రేణుక, కళావతి తదితరులు పాల్గొన్నారు.

నూతన బ్రిడ్జి నిర్మించాలని నిరసన


బ్రిడ్జిని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

నేలకొండపల్లి: మండలంలోని అనాసాగారాం-పమ్మి గ్రామాల మధ్య మంగాపురం మేజర్ కాల్వపై నూతన బ్రిడ్జిని వెంటనే నిర్మించాలని డిమాండ్ చేస్తూ గురువారం సీపీఎం ఆధ్వర్యాన కాల్వ బ్రిడ్జి వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకుడు గుడవర్తి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. అనాసాగారాం-ముదిగొండ మండలంలోని పమ్మి గ్రామాల మధ్య ఉన్న ఈ బ్రిడ్జి శిథిలావస్థకు చేరిందని, ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. అలాగే గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు ఎడ్ల తిరపతిరావు, పుల్లారావు, సత్యానందం, బొడ్డు మధు, బాబురావు, నున్నా మధుసూదన్‌రావు, కళ్యాణ్, రఘుపతి, నాగుల్‌మీరా, బుచ్చయ్య, యేసు, చావా శ్రీనివాసరావు, సంగీతరావు పాల్గొన్నారు.

తహసీల్ ఎదుట ధర్నా

కామేపల్లి: రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు అందించాలని కోరుతూ కామేపల్లి మండల తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యాన గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తుందని, దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాదావత్ శ్రీనివాస్, వింజం నాగభూషణం, సకినాల శ్రీను, సత్యనారాయణ, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

● వర్షంతో పత్తికి జీవం..


పెండిప్రోలులో జీవం పోసుకున్న పత్తి మొక్కలు

అడపాదడపా వర్షాలతో పంటలు వడపడిపోతున్న తరుణాన గురువారం కురిసిన చిరుజల్లులతో పత్తి పంటలు జీవం పోసుకున్నాయి. మధ్యాహ్నం వరకు ఎండతో ఉన్న వాతావరణం ఒక్కసారిగా చల్లబడి చిరుజల్లులు కురవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యాన రైతుకి ఒక బస్తా మాత్రమే యూరియా ఇస్తుండడంతో పంటలకు ఎరువు ఎలా అనే ఆందోళనలో ఉన్నారు. రైతులకు సరిపడా యూరియా అందించాలని కోరుతున్నారు.
– తిరుమలాయపాలెం

కూపన్ల వారీగా యూరియా పంపిణీ

➡ 90 టన్నుల యూరియా పంపిణీ

తిరుమలాయపాలెం: మండలంలోని 10 కేంద్రాల్లో గురువారం 90 టన్నుల యూరియా పంపిణీ చేసినట్లు ఏఓ నారెడ్డి సీతారాంరెడ్డి తెలిపారు. కాగా, మండలంలోని ఎర్రగడ్డ, తాళ్లచెరువు, హైదర్‌సాయిపేట గ్రామాల్లో రైతులు అధిక సంఖ్యలో రాగా ఉన్నంతవరకు యూరియాను అందించి మిగిలిన రైతులకు కూపన్లు అందించినట్లు చెప్పారు. హైదర్‌సాయిపేటలో రైతులు ఎక్కువ సంఖ్యలో రావడంతో ఎస్ఐ జగదీష్, ఏడీఏ సతీష్, ఏఓ సీతారాంరెడ్డి దగ్గరుండి పంపిణీ చేయించారు.

➡ నేలకొండపల్లిలో..

నేలకొండపల్లి: యూరియా కోసం వచ్చే రైతులు కూపన్లతో పాటు పట్టాదారు పాస్ పుస్తకాలు తీసుకురావాలని ఇచ్చిన రైతులు మాత్రమే రావాలని మండల వ్యవసాయాధికారి ఎం.రాధ సూచించారు. మండల కేంద్రంలోని తన చాంబర్‌లో ఆమె విలేకర్లతో మాట్లాడుతూ.. నేడు(శుక్రవారం) స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో కూపన్ల వారీగా యూరియాను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

➡ కొత్త సబ్ సెంటర్ల ద్వారా..

రఘునాథపాలెం: రైతులకు మంచుకొండ సహకార సంఘం పరిధిలో కొత్త సబ్‌సెంటర్ల ద్వారా గురువారం యూరియా పంపిణీని ప్రారంభించినట్లు సంఘం సీఈఓ శ్రీనివాసరావు తెలిపారు. కూపన్ల వారీగా ఈర్లపూడి గ్రామంలో 450 యూరియా కట్టలు, సంఘం పరిధిలోని మంచుకొండలో 335 కట్టలు అందజేశామన్నారు. పోలీస్ బందోబస్తు మధ్య అధికారులు, సిబ్బంది యూరియా పంపిణీ ప్రారంభించనట్లు సీఈఓ వివరించారు.


మంచుకొండలో కూపన్లు జారీ చేస్తున్న అధికారులు

➡ నేడు అల్లీపురంలో

ఖమ్మంఅర్బన్: నగరంలోని 15వ డివిజన్ అల్లీపురం రైతువేదిక వద్ద వీవీపాలెం సహకార సంఘం ద్వారా రైతులకు నేడు(శుక్రవారం) యూరియా పంపిణీ చేస్తున్నట్లు సొసైటీ చైర్మన్ రావూరి సైదబాబు తెలిపారు. అల్లీపురం, ధంసలాపురం, కొత్తగూడెం, గొల్లగూడెం తదితర గ్రామాల పరిధిలోని రైతులకు 335 యూరియా బస్తాలు అందుబాటులో ఉన్నాయన్నారు.

▶ సెటప్ అదుర్స్..

నగరంలోని పాండురంగాపురం రోడ్డుపై ఓ స్కూటర్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వాహనంపై ప్లాస్టిక్ కవర్, పైకప్పు అమర్చి వర్షం, ఎండల నుంచి రక్షణ కల్పించేలా యజమాని ప్రత్యేకంగా తయారు చేసుకున్నట్లున్నాడు. ఈ వినూత్న ఆలోచనతో వర్షాకాలంలో, ఎండకాలంలో ప్రయాణం సాఫీగా సాగించవచ్చని చూపించారు. ఈవాహనం ప్రత్యేకంగా ఉండడంతో పలువురు ఆసక్తిగా తిలకించారు.
- ఖమ్మంఅర్బన్


వర్షం,ఎండల నుంచి రక్షణ సెటప్

ఎయిడ్స్ పేషంట్లపై వివక్ష చూపొద్దు


అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఖమ్మంవైద్యవిభాగం: ఎయిడ్స్ పేషంట్లపై ఎటువంటి వివక్ష చూపొద్దని హెచ్ఈఓ రవికుమార్, జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి పి.వెంకటరమణ అన్నారు. గురువారం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సమావేశం మందిరంలో వివిధ విభాగాల అధిపతులకు వారు అవగాహన కల్పించారు. అనంతరం హెచ్ఐవీ బాధితులకు ఉన్న హక్కులు, హెచ్ఐవీ యాక్ట్-2017పై తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఎంఈ, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.నరేందర్, డాక్టర్ ఎల్.కిరణ్‌కుమార్, డాక్టర్ బి.ఎల్.కిరణ్‌కుమార్, డిప్యూటీ జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ యూనిట్ సభ్యుడు డి.సత్య కుమార్, డీపీఎం మహమూద్ అలీ, వీరయ్య, రామకృష్ణ పాల్గొన్నారు.

➡ హెచ్ఐవీపై కళాజాతా


ప్రదర్శనలో పాల్గొన్న కళాకారులు

కూసుమంచి: మండలంలోని పాలేరు గ్రామంలో కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం హెచ్ఐవీ నివారణపై చెరుకుపల్లి ప్రేమకుమారి కళాబృందం ఆధ్వర్యాన కళాజాతా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై పాటలు, కళారూపాల ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి హరీష్‌తో పాటు కళాబృందం సభ్యులు, ప్రేమకుమారి, కాంపాటి శ్రీను, నరాటి చంద్రమోహన్, తోటపల్లి నాగేశ్వరరావు, మధు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు పురస్కారాలు

ఖమ్మంవ్యవసాయం: సిటిజన్ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ ఖమ్మం బ్రాంచ్ ఆధ్వర్యాన గురువారం టెన్త్, ఇంటర్‌లలో 95 శాతం మార్కులు సాధించిన షేర్ హోల్డర్ల పిల్లలకు నగదు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందించారు. ఈ సందర్భంగా సొసైటీ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.నరేంద్రకుమార్ మాట్లాడుతూ.. గత 27 ఏళ్లుగా నగదు బహుమతులు అందిస్తుండగా.. ఈ ఏడాది ఖమ్మం బ్రాంచిలో ప్రతిభ కలిగిన ఏడుగురు విద్యార్థులకు రూ. 10 వేల నగదు, బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ బ్రాంచి మేనేజర్ కె.సైదేశ్వరరావు, బ్రాంచ్ రిలేషన్‌షిప్ మేనేజర్ సాయిబాబు, సొసైటీ స్టాఫ్ సభ్యులు, షేర్ హోల్డర్లు తదితరులు పాల్గొన్నారు.


నగదు పురస్కారాల కార్యక్రమంలో సొసైటీ ఎండీ నరేంద్రకుమార్, తదితరులు

అటెన్షన్ ప్లీజ్

పొంచి ఉన్న ప్రమాదం..



మండలంలోని పండితాపురం-బండిపాడు గ్రామాల మార్గమధ్యలోని సీతబంధం వాగు సమీపాన ఇటీవల కురిసిన వర్షానికి బీటీ రోడ్డు కోతకు గురై పెద్ద గుంత ఏర్పడింది. దీంతో నిత్యం ఈ రహదారి గుండా వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుండగా.. ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పక్కనే ముళ్ల ముళ్ల పొదలు చాటునే గుంత ఉండడంతో గమనించకుండా అదుపుతప్పితే ఇక అంతే సంగతి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు ఇరువైపులా చెత్తాచెదారాన్ని తొలగించి కోతకు గురైన ప్రాంతంలో మరమ్మతులు చేయాలని పలువురు కోరుతున్నారు.
– కామేపల్లి